# 'శమిత'

తులసీ కృష్ణ

'ఇంకా సర్దవలసిం దేమి'న్నట్లుగా ఆలోచించింది శారద. ఇంకేమీ లేదు, ఇంకేమీలేదు. కానీ, యేదో సర్దవలసినట్లుగానే తోస్తోంది. అదే మిటో జ్ఞప్తి రావటంలేదు.

శ్రీహరి వేసుకున్న పడక్కుర్చీ, విడిచేసిన చొక్కా, బల్లపైనున్న 'సిగరెట్ యాష్ ట్రే' అన్నీ ఒక్కొకటి ఒక్కొక శ్రీహరిలా తోచి చీకాకేసింది.

అయిపోయింది. ఇంకో అర్ధగంట మాత్రమే టైముంది. అంతటితో ఆ గ్రుచ్చి గ్రుచ్చి చూసే వాటికీ తనకూ యే సంబంధం ఉండదు, వీటిని గురించిన ఆలోచనల భారం తనమీద ఉండదు. ఇంతే కదా యీ జీవితం? మమకారం వున్నన్ని నాళ్ళు చీపురు కట్ట గూడా దాచుకోవలసిన వస్తువు లానే కనబడుతుంది.

శ్రీహరిమీదా, యీసంసారం మీదా విరక్తి కలిగింది తనకు. గడచిన నాలు గేళ్ళపాటు కాలమూ, యీ విరక్తిని బల పర్చేందుకే వినియోగింపబడింది. అందులో యెక్కడేనా నవ్వుకున్న గురుతులూ, సంతోష మనుభవించిన స్మృతులూ, వుంటే వాటిని పోషించిన ఉదారత శ్రీహరిది కాదు. యధార్థం తెలీని మనస్సు వూహించిన, అందమైన, ఆశావహమైన వూహ అది. అది అసలు సంతోషం కానేకాదు. సంతోష మనుభవించడం దాకా యెందుకు? సంతోష మనుభవించాలనే కోర్కె కూడా లేనంతటి చైతన్య శూన్యురాల్ని చేశాడీ శ్రీహరి!

ఎప్పుడోవస్తాడు! సంతోషమంతా స్నేహితులకు పంచేసి, పుట్టెడు విసుగుతో పెళ్ళాన్ని ముంచెత్తటానికి. అప్పుడేమౌతుంది?

మూసి వుంచిన తలుపులు, మూసుకున్న అతని హృదయ ద్వారాన్ని తెఱచి. అతని తప్పుల్ని యెత్తి చూపుతోంటే పశ్చాత్తాప పడతాడు, తనంత నిర్లక్ష్యం చెయ్య దగ్గది కాదని తెలుసుకుంటాడు. కానీ, తనకేమీ సంబంధం లేదు. అతని బాధకు, తను వోదార్పు నందించలేదు. ఇంక 'తను' — తనే! తానులో, అతను, లేడు. తన 'డిగ్రీ' ప్రయోజనంతో అతి విశాలమైన, సమ్మోహనమైన స్త్రీ స్వాతంత్ర్య లోకంలోకి అడుగిడ బోతోంది. ఈ పూర్వాశ్రమ జీవితంలోని నిరాశలు, నిట్టూర్పులు, కన్నీళ్ళ నించీ అప్పుడు తనకు విముక్తి కలుగుతుంది.

ఆమె లేచి అటూ యిటూ తిరిగింది. హఠాత్తుగా యేదో మఱచి పోయిన విషయం జ్ఞప్తికొచ్చి నట్లయింది. అవును, యిదేనేమో? ఇది చెయ్యక పోవడం వల్లనేమో యెక్కడో, యేదో వెలితి కన్పిస్తోంది. ఆమె చిన్న కాగితం

ముక్క చించి, 'సూట్‌కేస్' తాళం తెఱచి పెన్నందుకుని వ్రాయసాగింది.

శ్రీహరిగారికి,

నేను వెళ్ళిపోతున్నాను. ఈ జన్మకి మీతో గడిపిన నాలుగేళ్ళ సాంసారిక జీవితం చాలు! దాన్ని గురించి వ్యాఖ్యానంచేసి పెంచటం, తెంచుకోవాలనుకున్న నా కిష్టంలేదు. అందమైన, విశాలమైన యిల్లు, దాచుకోటాని కక్కడా వోపికలేనన్ని సిల్కు చీరెలు! జీవితం విలువైనదే, కానీ, పంజరం బంగారందైనంత మాత్రాన, బంధించబడిన పక్షికేమీ లాభం లేకపోవటమేగాక, పైగా వెక్కిరింపుగా తోచి, దాని కింకా కుమిలింపు కావొచ్చు!

ఇంతకు క్రితమే నన్ను చూడాలని మా జనార్దనం బావొచ్చాడు. ప్రస్తుతం యిద్దరం కలసి మా పుట్టింటికి వెళ్ళుతున్నాము. అక్కడ కొంత కాలం ఉంటాను.

ఇట్లు,
శారద,

ఆమె వ్రాసింది ఒక్కసారి చదువుకుని డ్రాయర్ సొరుగులో పడవేసి, మూయకుండా అలాగే వుంచేసి, దాని పైన ఓ సిగరెట్ పాకెట్ వుంచేసింది.

సామాన్లు బైటచేర్చి - తలుపులేసి, తాళం పక్కింటామెకిచ్చి, ఆయనొస్తూనే భద్రంగా అందించమని చెప్పాలనుకుంది. కానీ, యిప్పుడాలోచిస్తే అందులో యిబ్బంది వుంది. ఆమె అడిగే అర్థంలేని ప్రశ్నలకు, అబద్ధపు జవాబులు చెప్పవలసి వుంటుంది. అదీ కాక, యెవరో అన్నట్లు 'లేచివెడుతూ మొగుడికి వంకాయవండిపెట్టమందట'. అలాగుంది.

పసోన్న 'రిక్షా' నాపి, ఐదునిముషాల్లో 'స్టేషన్' చేరుకుంది. రైలు అరగంట లేటవటం యేదో అపశకునంలా తోచింది. తనపేరు మీదుగా పిలుపువిని వెనక్కిచూస్తే, పరిచయమైన, 'పద్మనాభం' అనే కుర్రవాడు! ఉత్సాహంతో ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు. ఒకానొక సమయంలో పద్మనాభం, అనే కుర్రవాడడిగే మామూలు ప్రశ్నలకు, యింతగా ఆలోచించవలసి వుంటుందనీ, యింత సందేహపడవలసి వుంటుందనీ, యింతకు ముందెన్నడూ తోచలేదామెకు!

ఇంత ధైర్యంచేసి, యిన్నాళ్ళ దాంపత్య బంధాన్ని తెంచెయ్యటానికి సిదపడి, ముందున్న సుదూరమైన జీవిత పథం వెంట, వొంటిగా పయనించటానికి సాహసించిన తను, యీ కుర్రవాడి దగ్గఱ యింత పతనం చెందటం తల్చుకుంటే, ఆమె కేదో భయం, నిస్పృహ, తనమీద తనకే అవిశ్వాసం కలుగుతోంది.

అలజడిపడే హృదయాన్ని సరిదిద్దుకోటానికి, ఆమె వెయిటింగ్ రూముకి వెళ్ళబోయి ముందుకు చూచి వులికిపడింది. జనార్దనం బావ, మరో అతని చేయి పట్టుకుని, 'ప్లాట్ ఫారమ్' ఆ చివఱనించీ వస్తోన్నాడు!

ఆమె చప్పున 'దొంగ' దాక్కున్నంత వడిగా, 'వెయిటింగ్ రూమ్'లో దూరింది. వాళ్ళిద్దరూ అలా వచ్చి శారద కెదురుగా మాట్లాడుకుంటోన్నారు. శారద మరోవేపు తల త్రిప్పి, అద్దంలో చూస్తోంది. ముఖమంతా వాడి, తనది కానట్లే వుంది.

వాళ్ళిద్దరూ అలా మాట్లాడుకుంటూనే యింకా ముందు కెళ్ళిపోయారు. వాళ్ళ మాటల్లో జనార్దనం బావ తనువెళ్ళబోయే రైలు కోసమే వున్నట్లు తెలుసుకుంది. ఎంత చిత్రం? రెండేళ్ళనించీ కనపడని బావ, యివాళ తనెక్కబోయే రైల్లోనే ప్రయాణించటానికి, (ఒక్క రైల్లోనేయేం, ఒక్కచోటికే కావొచ్చు!) వచ్చాడు! బహుశా మామూలు సంఘటనే కావొచ్చు! కానీ, యిదేదో మెరుపులా హృదయాన్ని చీలుస్తోంది. ఎన్నో అనుభవాల, తెరల కావలి రహస్యాన్ని వెలికి తేవాలని తీవ్రయత్నం చేస్తోంది! ఆ సంఘర్షణలో ఆమె తల తిరిగిపోయింది.

ఏమిటి? — అదేమిటి?

'ఇంతక్రితమే నన్నుచూడాలని మా జనార్దనం బావొచ్చాడు! ప్రస్తుతం మేమిద్దరం కలిసి—'అవును, ఎందుకలా అబద్ధం వ్రాయవలసి వచ్చింది తాను? దానర్థమేమిటి? వీళ్ళెప్పుడయినా, శ్రీహరిని వీలైనంత 'హింస'కు గురి చేయాలన్న నీచమైన ఆలోచనా? లేక,—లేక, శ్రీహరితో దాంపత్యం త్యజించాలనీ, దని పర్యవసానం, జనార్దనం బావతో పారిపోవడమే ననే ఆలోచన, తనలో దాక్కునివుందా?

మరిప్పుడీ ఆలోచన యెందుకని కలుగలేదు? జనార్దనం బావతో కలసి వెళ్ళలేదనీ, తనొక్కతే వెళ్తోందనీ, తనకు మాత్రమే పరిమితమైన ఆత్మతృప్తి కారణంగా యిదేమీ స్ఫురించలేదా? మరిప్పుడు—తనలో యెప్పుడో పడిన దోషంకూడా, ఈ క్షణంలో పెరిగి విజృంభించి, తన్నులోబఱచుకోటమేనా? — ఏల్లేదు. ఆమె 'సూట్‌కేస్' అందుకుని స్టేషన్ బైటికి చేరుకుంది. ఇల్లు చేరుకుంటున్న ఆమెలో ఒకేవిషయం రొద చేస్తోంది. శ్రీహరి వచ్చి, తను వ్రాసిన కాగితం చదివి వుంటే, ఈ 'కత' కు ముగిం పేమిటి?

ఆమె మూసిన తలుపులు, ఆమే మళ్ళీ తెరిచేసింది. సొరుగులో వున్న కాగితం తీసి చించి చెత్తబుట్టలో పడవేసింది. ఎక్కడి వక్కడ సర్దేసి, జబ్బుపడి లేచిన దానిమల్లే, ఆయాసంతో, పడక్కుర్చీలో వాలిపోయింది. గోడనున్న గడియారం అయిదున్నర చూపెడుతోంది. 'ఒక్కగంట'—అనుకుంది.

ఒక్క గంటలో, యుగాలనాటి తన లోపలి వేడి పై కుబికి, భూమి కంపించి, క్రుంగిపోటానికి యత్నించి, ఏ బలంతో మళ్ళీ తన 'వునికి'ని సాధించుకో గలిగిందో. మరో గంటకు యింటికి చేరిన శ్రీహరికి తెలీనే తెలీదు—

***